శాతవాహన యుగము

శాతవాహన రాజవంశ స్థాపనతో ఆంధ్రుల చరిత్రలోనేగాక దక్షిణ భారత చరిత్రలోనే నూతన అధ్యాయం ప్రారంభమయింది. దక్షిణదేశ రాజకీయ చరిత్ర శాతవాహనుల తోడనే ప్రారంభమైనదనడం అతిశయోక్తికాదు. ఉత్తరా పథం శక యవన పహ్లవాది విదేశీయుల దాడులతో సంక్షుభిత మవుతున్న సమయంలో దక్షిణాపథాన్ని సమైక్యంచేసి శాంతి భద్రతలు ప్రసాదించిన కీర్తి శాతవాహనులకు దక్కింది. ఆర్యావర్తంనుండి ద్రావిడ భూములలోనికి విస్తరించి ఉభయ ప్రాంతాలమధ్య వారధియైన సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి తద్వారా భారతదేశంలో సాంస్కృతికంగా ఏకత్వాన్ని సాధించడంలో చరిత్రాత్మకమైన పాత్రను శాతవాహనులు నిర్వహించినారన్న సర్దార్ పణిక్కర్ అభిప్రాయంలో ఎంతో సత్యం ఉంది. సుదీర్ఘమైన వారి పాలనకాలంలో ప్రాకృత సంస్కృత వాఙ్మయంలో వినూతన సాహిత్య సంప్రదాయాలు నెలకొన్నాయి. స్థాపత్యంలో శిల్పంలో మహత్తర విజయాలను ప్రజలు సాధించినారు; ఖండ ఖండాంతరాలలో ప్రశంసాపాత్రమైన శిల్పాల్ని సృష్టించినారు. సర్వతో ముఖాభివృద్ధిని సాధించిన దక్షిణ భారతం దూరదేశాల్లో భారతీయ సంస్కృతీ పతాకాన్ని ప్రతిష్టించడం ప్రారంభించింది.

శాతవాహనులు - ఆంధ్రులు

పురాణాలు మువ్వదిమంది ఆంధ్రులు సుమారు నాలుగున్నర శతాబ్దాల కాలం రాజ్యం చేసినట్లు చెబుతున్నాయి. కొన్ని పురాణాలు ఈ రాజులనే ఆంధ్ర భృత్యులని వ్యవహరిస్తున్నాయి. ఈ రాజులపేర్లు ప్రాచీన శాసనాల నుండి, నాణేలనుండి ఉద్ధరించిన శాతవాహన రాజుల పేర్లతో చాలవరకు సరిపోతున్నాయి. అందుచేత భండార్కర్, విన్‌సెంట్ స్మిత్, బర్జెస్; రాప్సన్ వంటి పండితులు శాతవాహనులు ఆంధ్రులేనని మగధలో శుంగవంశం విజృంభించిన సమయంలోనే వారు కృష్ణా గోదావరీ మండలంలో విజృంభించి (రాప్సన్) పశ్చిమోత్తర సీమలకు విస్తరించినారనీ, శ్రీకాకుళ, ధాన్యకటక నగరాలు వారి మొదటి రాజధానులనీ (బర్జెస్, బార్నెట్) తీర్మానించినారు. ఇటీవలి పండితులు కొందరు ఆంధ్ర శాతవాహన సామ్యమును తిరస్కరించినారు. వారిలో ప్రథముడు ఆచార్య వి. యస్. సుక్తంకర్. అతని వాదన సారాంశం : (1) పురాణాలు ఆంధ్ర,